# వయసు ముందుకి - మనసు వెనక్కి

బస్సు వచ్చి ఆగేసరికి అక్కడ కూర్చుని ఎదురుచూస్తున్న వాళ్ళంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. కేరింతలు కొట్టారంటే అందరూ వేగంగా కదిలి, బస్సెక్కేందుకు పరుగులు తీశారనుకుంటున్నారా? అబ్బే! అదేం లేదు. ఉత్సాహం ఉరకలు వేస్తున్నా అంతా అతి నెమ్మదిగా లేచి బట్టలు, జుట్లు సర్దుకుంటూ అడుగులో అడుగేస్తూ కదలడం మొదలెట్టారు. వాళ్ళంతా ఎక్కేవరకూ బస్సు కదలదనే ధైర్యమొకటే కాదు అక్కడున్న అసలు సంగతి. వారంతా అంతకుమించి చకచకా పరుగులు పెట్టే శక్తి ఉన్నవారు కాదు.

నెల్లాళ్ళుగా పథకాల మీద పథకాలు వేసుకుని స్త్రీలంతా ఒక బస్సు కట్టుకుని ఒక విహార యాత్రకి,లేదా ఒక విజ్ఞాన యాత్రకి రెండూ కలిపిన ఒక విలాస యాత్రకి వెళ్దాం అని నిర్ణయించుకున్నారు.

ఇళ్ళలో చాకిరీతో, బరువు బాధ్యతలతో విసుగెత్తిపోయిన వాళ్ళకి ఆ ఊహే ఒక పిల్ల తెమ్మెరలా అనిపించింది. సెల్‌ఫోన్ల మీద ప్రోగ్రామంతా రూపొందించేసుకుని, ఇళ్ళనించీ పోలోమంటూ బయట పడ్డారు. అందరూ తమకేదో స్వేచ్ఛ కొత్తగా వచ్చిన భావనతో ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు.

పక్షులు నిద్రించే చెట్టు వైపు తుపాకీ పేల్చినట్లు, పక్షులన్నీ ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరినట్లు వారు కదులుతున్నారు. కొందరు చిలకల్లా ఎగిరితే, కొందరు పావురాలు, కొందరు పిచ్చుకలు, మరికొందరు పాలపిట్టలు, ఇంకా కొందరు మైనాలు. ఆ సమూహంలో ముప్ఫై అయిదేళ్ళ మున్నా నుంచి మొదలు పెడితే నలభై, నలభై అయిదు, యాభై, యాభై అయిదు, అరవై అరవై అయిదు, డెబ్భై, డెబ్భై అయిదేళ్ళ ముత్తులక్ష్మి

వరకు అన్ని వయసుల వాళ్ళూ ఉన్నారు. యాభైలోపు వాళ్ళందరూ, సీనియర్ సిటిజన్ల బాధ్యత తీసుకున్నట్లు భావించి జోరుగా పెత్తనం చెలాయిస్తూ ఉన్నారు. అయితే వయసు మీద పడిన వాళ్ళేం తక్కువ తిన్నారా, వాళ్ళ పెద్దరికం పేరు చెప్పి చిన్నవాళ్ళని సతాయించి వదిలేస్తున్నారు.

అలాంటి ఒక మిశ్రమ సమ్మేళనంలో ఉన్న ఆనందం, ఆహ్లాదం అంతా, ఇంతా కాదు. ఎవరేమన్నా ఎవరూ పట్టించుకోరు. అన్నీ చిరునవ్వులు, చమత్కారాలు, గడుసు ప్రేమలు, సొగసు వగలు. ఇన్నాళ్ళకి అందరూ కలిసి స్వేచ్ఛగా నవ్వుతూ, తుళ్ళుతూ వెళ్తున్నామనే ఆనందం తప్ప మరోటి లేదు.

జుట్టునెరిసిన వాళ్ళు చాలామందే ఉన్నప్పటికీ, నెరిసిన జుట్టును కనిపించకుండా జాగ్రత్తపడిన వారే ఎక్కువ. మైసూర్ సిల్కుచీరలు, గద్వాలు నూలు చీరలు, కంచిపట్టు జరీ చీరలు, బెంగాల్, వెంకటగిరి, చెట్టినాడు, చెంగల్పట్టు రంగురంగుల చీరలు కరకర లాడుతూ, మిసమిస కదులుతూ, తళతళ మెరుస్తూ – అందరూ కలిసి నడుస్తూంటే పూల రథం కదిలినట్లుంది.

కొన్ని చుడీదారుల, మరికొన్ని పంజాబీ దుస్తులు, ఇంకా కొన్ని జీన్స్, కాటన్ టాప్స్‌తో ఆ సమూహం పాత కొత్తల మేలుకలయికలా కళకళలాడిపోతూ ఉంది.

రుక్మిణీదేవి నెమ్మదిగా బస్సు ఎక్కింది. పైన ఉన్న రత్న చెయ్యి పట్టుకుని సాయం చేసింది. బస్సు సీట్లో కూలబడుతూ ఆయాసపడింది.

"ఏమే రుక్కూ! ఎన్నాళ్ళకే మనకోరిక తీరింది. ముఖ్యంగా నువ్వు రావడం ఎంతో బావుంది నాకు" అంది సక్కూ.

"నాకు బావుందే సక్కూ!" అంది రుక్మిణి.

"ఏమిటే! నేను రావటమా – నువ్వు రావటమా?" అంటూ భుజం మీద గట్టిగా చరిచింది.

"నేను రావటమే" అంది రుక్కూ కొంటెగా.

"చూశావా అన్యాయం. నాకు నువ్వు రావటం ఆనందంగా ఉంది అంటే, నువ్వూ అలాగే అనాలి కదే!" అంది బుంగమూతిపెట్టి – రుక్మిణి నవ్వింది.

"ఇల్లూ, వంట, మొగుడు, పిల్లలు, అత్తగారు, చెత్తగోల లేకుండా, హాయిగా, స్వేచ్ఛగా వచ్చేస్తే ఎంతబావుంది!" అంది సావిత్రి విశ్రాంతిగా వెనక్కివాలి.

"బాగా చెప్పారు, సావిత్రి గారూ! పాల ప్యాకెట్లు వచ్చాయా, పని మనిషి ఇంకా రాలేదేం చెప్మా, పెందరాళే వంట మొదలు పెడదామంటే ఒక్క కూర ఇంట్లో ఉండి చావదు! అంటూ వెధవ గోల లేకుండా భలే ఉంది" అంటూ సావిత్రికి వంత పాడింది గాయత్రి.

"అమ్మో! నన్ను కరిచాడు – చచ్చేట్టు కరిచాడు" అంటూ అరిచింది గంగ.

'ఏమిటీ, ఏమిటీ' అంటూ అంతా కంగారుపడ్డారు.

"అబ్బే! ఇదిగో చూడండి నా చెప్పు కరిచి, మంటతో చస్తున్నా" అంది గంగ.

"చెప్పు కరిచింది అనకుండాకరిచాడు అంటావేమిటి!" అంటూ అమాయకపు ముఖం పెట్టింది అనసూయ.

"కరిచే దేనికైనా నేను 'డు' చేరుస్తాను. అందుకే చెప్పు కరిచాడు అంటాను" అని వివరించింది గంగ. అందరూ ఆనందంగా చప్పట్లు కొడుతూ జయజయధ్వానాలు చేశారు. ఆ సందడికి బస్సు మొత్తం కదిలిపోయింది.

"ఇది చాలా అన్యాయం" అన్నారెవరో.

"ఎవరికి తల్లీ అన్యాయం" అంటూ వ్యంగ్యంతో ఆక్షేపణ.

అందరూ వచ్చినట్టేనా అంటూ మున్నా అరిచింది.

"వచ్చిన వాళ్ళంతా వచ్చినట్టే, రాని వాళ్ళు ఇక్కడ లేరుగా" అందొక కంఠం అతి తెలివిగా కళ్ళుతిప్పుతూ.

"ధాం" అని తలుపు మూసి డ్రైవర్‌కి సాయంగా వచ్చిన క్లీనర్ ముందుకెళ్ళి కూర్చున్నాడు.

జిందాబాద్, జిందాబాద్ అంటూ అరుపులు, కేకలతో బస్సు బరువుగా కదిలింది.

"పోనీ బండి పోనీ బావా - అదే నోయి త్రోవ" అంటూ గంగ పాటందుకుంది. సావిత్రి "ఉష్... ఉష్... ఏవిటా పాట అసహ్యంగా" అంటూ మందలించబోయింది.

"అసయ్యం ఏముంది? నాకెంతో సంతోషంగా ఉంది. నేనేదైనా పాడతాను" అంది. అంతే అందరూ తలొక పాట అందుకున్నారు.

'చెల్ రే బేటా చెల్' 'షికారు పోయి చూదమా' 'జోరుగా - హుషారుగా - షికారు పోదమా - హాయి హాయిగా - తీయతీయగా' అంటూ అందరూ తలో వైపూ, తలోశ్రుతిలో, గట్టిగా పాటలు మొదలు పెట్టారు. ఇంతలో ఎవరో ' ఓ బాటసారీ ఇది జీవిత రహదారీ' అంటూ సాగదీస్తున్నారు.

"హోరుగాలిలో గాలివానలో పడవ ప్రయాణం" అంటూ మరొకరందుకున్నారు.

"ఛీ! ఆపండి! సమయం సందర్భం ఉండాలి. చక్కని పాటలు పాడండి" అంటూ గొంతు చించుకుంది సావిత్రి.

ఇంతలో సక్కు సెల్ మోగింది. హడావిడిగా బ్యాగ్‌లో వెదికి ఫోను పట్టుకుని 'హల్లో' అంది. 'ఊ - ఇప్పుడే బయల్దేరాం - చేరంగానే చేస్తా - ఆ... ఏమిటీ... వినిపించడం లేదు - ఆ... బొత్తిగా వినిపించడం లేదు - సరే - చేరిన వెంటనే చేస్తాలెండి" అంటూ ఫోను మళ్ళీ బ్యాగ్‌లో పడేసింది సక్కు.

"ఏయ్, సక్కూ! ఎవ్వరూ ఫోన్ తెచ్చుకోవద్దు, ఇంటి నుండి దూరంగా మూడు రోజులుందాం అనుకున్నాం. కదా!" అంది రుక్మిణి.

"అలాగని నువ్వు సెల్ తేలేదా!"

"అసలు నాకు లేదు. మా వాళ్ళు ఇస్తానన్నా మనం వద్దనుకున్నాం కదా అని వద్దు గాక వద్దని తేలేదు".

"అయ్యో, పిచ్చి రుక్కూ! సెల్ లేకపోతే ఎలా బతుకుతామే! పోనీలే నా సెల్ కావలిస్తే తీసుకుందూ గానీలే".

'వద్దులే' అనేసి రుక్మిణీదేవి ఆలోచనలో పడింది. ఈ ప్రయాణం ముందు ఇంట్లో జరిగిన వాదవివాదాలు గుర్తుకొచ్చాయి.

రాఘవరావు ఈ విహారయాత్ర ఫిక్స్ అవగానే "సెల్ నీతో పట్టుకెళ్ళు! ఎప్పుడు నువ్వు మాట్లాడాలన్నా అందుబాటులో ఉంటుంది" అన్నాడు. అప్పటికే అందరూ సెల్‌ఫోన్లు తీసుకువెళ్ళద్దని నిర్ణయించుకోవటం వల్ల "ఏం అవసరం లేదు. మూడు రోజుల్లో కొంపలేం మునిగిపోవు" అంది.

"అదేమిటి? నువ్వెక్కడున్నావో మాకూ తెలుస్తుంది. నువ్వేదైనా చెప్పాలన్నా వీలవుతుంది" అన్నాడు.

"ఫోను ఉంటే మాత్రం చెప్పాలనేం ఉంది. మొన్నా మధ్య సుప్రీంకోర్టు పనిమీద వెళ్ళినప్పుడు మీరు రోజున్నర ఫోను చేయకుండానే ఉన్నారు" విసవిసలాడింది రుక్మిణి.

"ఏదో పనిలో బిజీగా ఉండి చేయలేదు".

"నేనూ బిజీగానే ఉందామనుకుంటున్నా" అంది

"అయితే మరీ మంచిది" రాఘవరావు తన పనిలో పడిపోయాడు.

అపర్ణ వచ్చి "అదేమిటే, అమ్మా! అట్లా మాట్లాడతావు. సెల్ పట్టికెళ్ళు. నాది ఇస్తా".

"ఒద్దులే, తల్లీ! నీ ఫ్రెండ్స్ అందరికీ రిప్లై చేయలేక చావాలి"

ఇంట్లో కొడుకూ కోడలూ, కూతురు అందరూ ఇస్తానన్నా 'ఒద్దూ' అంది రుక్మిణి. కారణం ఏమిటంటే ఓ మూడు రోజులు ఈ కుటుంబ సంబంధాల నించీ, ఈ బంధాల నించీ ఫ్రీగా తనకోసం తను, తన ఆనందం తను పొందాలని, తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుని దూరంగా ఉండాలని కోరుకుంది.

ఎక్కడో ఒకచోట సెల్ మోగుతూనే ఉంది. ఎవరో ఒకరు హలో అంటూ మాట్లాడుతూనే ఉన్నారు. ప్రయాణపు హోరులో అందరూ గొంతులు చించుకుని మాట్లాడడం తప్పడం లేదు.

"ఆ... ఇప్పుడే బయల్దేరాం. బాగుంది. బస్సు కూడా బాగుంది. మళ్ళీ చేస్తాను".

"బుజ్జిగాడికి దగ్గరుండి అన్నం పెట్టు. వదిలేస్తే వాడు తినడు. నీకు బొత్తిగా శ్రద్ధ లేదు. సరేరా!"

"ఏమిటీ! మీ నాన్నగారు టిఫిన్ తినకుండా వెళ్ళిపోయారా. అవున్లే, ఆయనకి

బయట హోటల్లో తినడం అంటే మహా ఇష్టం. అందుకే నేను స్ట్రిక్ట్‌గా ఉంటాను. సరేలే. నువ్వేం చేస్తావ్. నేనొచ్చాక చెప్తాలే".

"పనమ్మాయి ఇంట్లో పనిచేసేప్పుడు కూడా ఉండు. ఎవర్నీ నమ్మలేం. మీరు ఎక్కడవక్కడే పడేస్తారు. నువ్వూ, తమ్ముడూ కాస్త శ్రద్ధగా ఉండండి. సరే. మళ్ళీ చేస్తా".

ఈ విధంగా రకరకాల సంభాషణలు వింటూంటే రుక్మిణికి చాలా విసుగనిపించింది. వీళ్ళంతా కుటుంబాల గురించి నిరసన ప్రకటించింది కేవలం తాత్కాలికమన్న మాట. మరి ఇదేమిటీ, బయల్దేరిన రెండు గంటల్లో ఒకొక్కసారి ఇంటికి సెల్‌ఫోన్లో మాట్లాడనివారు లేరు.

కిటికీలోంచి చల్లటిగాలి ముఖానికి తగిలి మత్తుగా నిద్ర ముంచుకొచ్చింది.

అందరికీ టిఫిన్ పొట్లాలు, కాఫీలూ, టీలూ, కరకరలూ, మిఠాయిలూ, జాంపళ్ళు కూర్చున్న చోటకే అన్నీవచ్చి పడుతున్నాయి. కాళ్ళు పట్టేశాయని అంతా ఒక్కసారి బస్సు దిగి అటూ ఇటూ పచార్లు చేసి మళ్ళీ ఎక్కారు. అంతా ఒక నిద్ర తీసి లేచారేమో. కబుర్లలో పడ్డారు.

ఎవరు మాట్లాడినా కుటుంబ సంబంధాలలోని లొసుగుల గురించి భర్త, అత్తగారు, వియ్యపురాలు, ఆస్తి, రాబడి, పెరిగిన బంగారం ధర, సడన్‌గా పడిపోయిందనే రియల్ ఎస్టేట్, ఆరోగ్య చిట్కాలు.

ప్రతి వాళ్ళూ తామంత క్రమబద్ధంగా ఉంటారో చెప్తున్నవాళ్ళే. అందరూ తమకెంత తిండి వ్యామోహం లేదో చెప్పే వాళ్ళే. బస్సంతా గలగలమని గజ్జల గుర్రంలా కదులుతోంది.

"ఏమే, రుక్కూ! నువ్వింటికి మాట్లాడతావా? సెల్ ఇవ్వనా!" అంటూ వచ్చింది మూడుసీట్ల అవతల కూర్చున్న సక్కూ.

"వద్దులే" అంది రుక్మిణీ. కానీ ఒక్కసారి మాట్లాడితే బాగుండుననిపిస్తోంది. ఆమె మనసు మనవడి మీద కొట్టిమిట్లాడుతోంది.

తన మనవణ్ణి కోడలు శ్రద్ధగా, సరిగ్గా చూడదని ఆమె నమ్మకం. వాడు అన్నం తిననంటే తిప్పితిప్పి పెట్టదనీ, కడుపు మాడితే వాడే తింటాడని ఊరుకుంటుందనీ రుక్మిణికి కోడలు మీద కోపం. 'ఆమె కన్నతల్లి కదా, ఎందుకలా ఉంటుంది?' అని ఎవరైనా అడిగితే, 'కన్నంత మాత్రాన ప్రేమ ఉంటుందా?' అని ఎదురు ప్రశ్నవేస్తుంది రుక్మిణి.

బస్సు సడన్‌గా ఆగింది. మట్టిరోడ్డు కిరువైపులా లావెండర్, పింక్‌పూలు ఆకులు కనిపించకుండా పూసేసి ఉన్నాయి. అందరూ అబ్బా అబ్బా ఎంత బావుంది అంటూ కేకలూ, ఆనందం. మున్నాలేచి "మనం ఇంకా అడవిలోకి వెళ్తాం. అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందవు. ఎవరైనా సెల్‌ఫోన్ మాట్లాడాలనుకుంటే ఇప్పుడే మాట్లాడేసెయ్యండి.

మళ్ళీ ఆరుగంటల వరకూ వీలు పడదు" అంటూ ప్రకటన చేసింది. అంతా బిలబిలా బస్సు దిగేశారు. సక్కూ, రుక్కూ దగ్గరికి పరిగెత్తుకొచ్చి "రుక్కూ, నువ్వసలు ఇంటికి మాట్లాడలేదుగా. తొందరగా రెండు ముక్కలు మాట్లాడేసెయ్. నీ తర్వాత నేనూ మాట్లాడతా" అంటూ ఇచ్చింది.

అప్పటికే రుక్మిణి మనసు ఇంటి చుట్టూ గిరిటీలు కొడుతోంది. అందుకు వెంటనే అందుకుంది. కూతురు 'అమ్మా' అంటూ అరిచేసరికి ఆనందంతో మనసు పులకించి పోయింది. కొడుకూ, కోడలూ, భర్త అంతా పలకరించారు. ముద్దుమాటల మనవడు 'బామ్మా' అంటూ దీర్ఘం తీశాడు. ఇంకా మాట్లాడాలని ఉన్నా కట్‌చేసింది. మరి సక్కూ కూడా మాట్లాడాలి కదా అని – ఆ మాటే అంది. సక్కూ నవ్వేస్తూ.

"నేనిప్పటికి రెండుసార్లు మాట్లాడాగా. ఎటొచ్చీ మరో ఎనిమిది గంటలు సిగ్నలు అందదనీ" అంది.

పది నిముషాల సేపు బస్సు జనం కిందకి దిగి ఎడం చెవికి సెల్ అతికించుకుని పలకరింతలు, అప్పగింతుల, సలహాలు, సంప్రదింపులు, వేళాకోళాలు, వెక్కిరింతలు, జాగ్రత్తలు ఇలా గలగల మాటలు ఆ బాట పక్క విరగపూసిన పూలతో కలిసి పరిమళించాయి.

మళ్ళీ బస్సు నిండుగా కదిలింది. అందరి మనస్సులో ఒక తృప్తీ, ఆనందం.

రుక్మిణి కిటికీలోంచి చూస్తూ ఆలోచనల్లో పడింది. స్వేచ్ఛ అంటే ఏమిటి? అస్తిత్వం అంటే దానికి అర్థం ఎలా చెప్పాలి? జిడ్డు కృష్ణమూర్తి 'నువ్వు అంటే ఏమిటి?' అన్నారు.

నువ్వు అంటే నీ ఆస్తి, నీ కుటుంబం, నీ బంధాలు, నీ ప్రేమలు, ఇవన్నీ కలిసే గద నువ్వు.

అవన్నీ వద్దనుకుని నువ్వు వేరుగా పక్కకి జరగగలిగితే దూరంగా నిలబడితే నువ్వో పెద్ద యోగివైపోతావు.

నేనూ, నేనంటూ అనుకుంటున్నది ఎంతవరకు నేను – తెగని ఆలోచన.

అడవి మధ్య గెస్ట్‌హౌస్ ముందు బస్సు దిగుతూంటే, చిత్రమైన భావన.

మోటారు శబ్దాలు, సెల్‌ఫోను రింగులూ, బస్సు హారన్లూ, ట్రాఫిక్ రొదలూ, మైకులూ, భక్తి గోలలు లేవు.

ఎన్నోరకాల పక్షుల కలకలలు – ఉండుండి దూరంగా కోయిల హాయిగా స్వేచ్ఛగా పాడే పాట. మువ్వల్లామోగే పిట్టల కూతలు, కాళ్ళకింద నలిగే ఎండుటాకుల లయ విన్యాసాలు.

మనిషి కోరే స్వేచ్ఛ, ఏకాంతం అంటే ఉన్న వాతావరణం నుంచి మార్పుకోరడమే.

ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టలేని ఒక బలహీనతనాధారం చేసుకుని బ్రతికేయడమే?

గత జన్మ చేసుకున్న శ్రుతి ఆధారంగా జీవనరాగం ఆలపించడమే?

రుక్మిణి గెస్ట్ హౌస్ ముందు వేసి ఉన్న సోఫాలో విశ్రాంతిగా కూర్చుంది. ఆమె మనసు ఆలోచిస్తూనే ఉంది. ప్రశ్నలు జవాబులూ సాగుతున్నాయి. రుక్మిణిని ఆలోచనలు ముసురుతున్నాయి. ఈ భవబంధాల నుంచి మనసు దూరంగా వెళ్ళాలి అంటే అది సాధ్యమా? భౌతికంగా, ఇంటినుండి, సంసార బంధాల నుండి ఎంత దూరం వెళ్ళినా, మనసు ఇంటి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. ఏదో కష్టపడిపోతున్నామనీ, ఏదో కోల్పోతున్నామనీ తెగబాధ పడిపోతుంటాము. ఈ కష్టాలు, కోల్పోవడాలు అన్నీ మనం కోరుకున్నవే - ఇవన్నీ లేకపోతే ఏం తోస్తుంది? జీవితం విసుగెత్తిపోదూ - అలా విసుగొచ్చినప్పుడు కాస్త అటూ ఇటూ తిరిగి రావడమే.

(6-5-2009, నవ్య వీక్లీ.)